


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :172 | బుధవారం 25 జూన్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## ఆపదలో ఆదుకున్న ఆత్మ బంధువులు..!

- డీటీ రాజేష్ ఖన్నా కోసం తరలి వచ్చిన రెవెన్యూ బలగం
- కష్టాల కడలిలో తోడై నిలిచిన ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి
- మంగళ సూత్రాలను అమ్మి ఆస్పత్రి బిల్లులు చెల్లించాలనుకున్నా
- జేఏసీ నేతలతో వాపోయిన రాజేష్ ఖన్నా భార్య రమాదేవి

హైదరాబాద్ బ్యూరో,24 జూన్ (కెరటం న్యూస్):



ఇంటికి పెద్ద దిక్కు అనారోగ్యంతో ఆస్పత్రి పాలయ్యాడు. అప్పుసప్పు చేసినా ఆస్పత్రి బిల్లులు చెల్లించలేని దుస్థితి. చివరకు మంగళ సూత్రాలనైనా అమ్మి ఆస్పత్రి బిల్లులు చెల్లించాలనుకుంది ఆ ఇంటి ఆవిడ. దిక్కుతోచని స్థితిలో కష్టాల కడలిలో ఉన్న ఆ కుటుంబానికి రెవెన్యూ బలగం తోడై నిలిచింది.

## ట్రంప్ సీస్‌ఫైర్ విఫలం..

### ఇజ్రాయెల్‌పై మళ్లీ ఇరాన్ క్షిపణి దాడులు..!



న్యూస్ డెస్క్ ,24 జూన్ (కెరటం న్యూస్): గత కొన్ని రోజులుగా ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న పరస్పర దాడులతో పశ్చిమాసియా అల్లకల్లోలంగా మారిన విషయం తెలిసిందే. తాజాగా ఇరు దేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దీంతో అంతా సద్దుమణుగుతుందని అందరూ భావించారు. ఈ ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే ఇరాన్ తాత్కాలిక యుద్ధ విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఇజ్రాయెల్ ఆరోపించింది. సీస్‌ఫైర్ అమలులోకి వచ్చిన 2 గంటలకే ఇరాన్ నుంచి 2 బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించారని ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) ఓ ప్రకటనలో పేర్కొంది. దీనికి తగిన సమాధానం ఇస్తామని హెచ్చరించింది.



## బీజేపీలో చేరికపై శశిథరూర్ స్పందన

న్యూస్ డెస్క్ ,24 జూన్ (కెరటం న్యూస్): కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్.. నిత్యం ఎన్డీఏ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తూ.. ప్రధాని మోడీని ఆకాశానికి ఎత్తుతున్నారు. అంతేకాకుండా బీజేపీ ఎంపీలతో చెట్టాపట్టాల్ వేసుకుని తిరగడంతో శశిథరూర్ పార్టీ మారడం ఖాయమని పొలిటికల్‌గా అందరూ ఫిక్స్ అయిపోయారు.






# కష్టపడితేనే పదవులు..

### మరో పదేళ్ల అధికారం మనదే: సీఎం రేవంత్ రెడ్డి

- పదవుల కోసం కాదు.. పార్టీ కోసం పనిచేయండి
- 2033 వరకు అధికారం మనదే..
- 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే
- కులగణన, ఎస్సీ వర్గీకరణలో తెలంగాణ దేశానికి ఆదర్శం
- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లకు సిద్ధంగా ఉండండి
- రెండోసారి అధికారంలోకి రావడం మీ చేతుల్లోనే- సీఎం రేవంత్ రెడ్డి

న్యూస్ డెస్క్ ,24 జూన్ (కెరటం న్యూస్): కాంగ్రెస్ పార్టీలో కష్టపడితే కచ్చితంగా పదవులు వస్తాయని ఇప్పుడున్న చాలా మంది నేతలు కింది స్థాయి నుంచి వచ్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్లే నా ఎదుగుదల సాధ్యమైందని పార్టీ బాధ్యత మోసిన వారికే ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉంటుందన్నారు. మంగళవారం గాంధీభవన్ లో పీఏసీ మీటింగ్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ నూతన ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ రచించిన 'విధ్వంసం నుంచి వికాసం వైపు' పుస్తకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఎంతో మంది పదవుల కోసం పోటీ పడ్డారన్నారు. మీరంతా పార్టీ నిర్మాణంలో కీలక భాగస్వామ్యం తీసుకోవాలన్నారు. మన ప్రభుత్వం అనేక సక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని, ఈ దేశంలో అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన రాష్ట్రం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే సాధ్యమైందన్నారు. కార్యకర్తల ఎన్నికలు (స్థానిక సంస్థల ఎన్నికలు) రాబోతున్నాయి. మన కార్యకర్తలను కష్టపడి గెలిపించుకోవాలి. పార్టీ కమిటీ నాయకులు క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందేనని పార్టీ నిర్మాణంలో కార్యకర్తలు క్రియాశీల పాత్ర పోషించాలన్నారు. పార్టీ కోసం పని చేయనివాళ్లను ఎన్నికల ముందు బాధ్యతల నుంచి తప్పిస్తామని హెచ్చరించారు.

## రాజకీయాలకతీతంగా బోనాలు చేసుకుందాం..





న్యూస్ డెస్క్ ,24 జూన్ (కెరటం న్యూస్): నగరంలో ఎంతో వైభవంగా జరిగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాలపై ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అమ్మవారి బోనాల ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చారిత్రాత్మకమైన ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు రాజకీయాలకు అతీతంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పక్షాన ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా స్థానికుల సహకారం లేకపోతే విజయవంతం కాదన్నారు. గత సంవత్సరం ఏమైనా పొరపాటు జరిగితే సమీక్షించుకుని మరిన్ని ఏర్పాట్లు చేయడానికి ఈ సమీక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ఎన్నికల్లో గెలిచే దమ్ము లేకే ఫోన్ ట్యాపింగ్..



- ఎన్నికల్లో గెలిచే ధైర్యం లేకే కేసీఆర్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్
- నా కుటుంబం, గన్‌మెన్‌ల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు
- కేసీఆర్ కోసం ఎస్ఐబీ మాజీ చీఫ్ నిబంధనలు అతిక్రమించాడు
- ఫోన్ ట్యాపింగ్ కేసు నత్తనడకన సాగుతోంది - ఎంపీ ఈటల రాజేందర్ ఫైర్

న్యూస్ డెస్క్ ,24 జూన్ (కెరటం న్యూస్): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీజేపీ నేతలు ఈటల రాజేందర్, ప్రేమేందర్ రెడ్డి వాంగ్మూలాలను మంగళవారం సిట్ అధికారులు నమోదు చేశారు. 2023 నవంబర్ ఎన్నికల సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీరిద్దరి ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. ఇప్పటి వరకు 4వేల ఫోన్లు ట్యాపింగ్ అయినట్లు సిట్ అధికారులు కనుక్కున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ ఎదుట ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈటల స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డు చేశారు.

## పోలవరం బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు నష్టం లేదు..

**: చంద్రబాబు**



## కవితకు సీపీఎం సంపూర్ణ మద్దతు..

**జాన్‌వెస్లీతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ భేటీ**



## హైదరాబాద్‌లో మొదటిసారి బెట్టింగ్ యాప్ ప్రమోటర్స్ అరెస్ట్



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కచ్చితంగా గెలవాల్సిందే

**: మీనాక్షి నటరాజన్**



న్యూస్ డెస్క్ ,24 జూన్ (కెరటం న్యూస్): పీఏసీ మీటింగ్ లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించిన సన్నాహాలను అడిగి తెలుసుకున్నారు తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్. ఉప ఎన్నికపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ ఉప ఎన్నికలో కచ్చితంగా గెలవాల్సిందేనని ఆమె సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం గ్రేటర్ పరిధిలోని నాయకులందర్నీ సమన్వయం చేయాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్ కు బాధ్యతలు అప్పగించారు.

- రైతు భరోసా పేరుతో మోసం.. 511 మంది ఆత్మహత్యలపై హరీశ్ రావు మండిపాటు
- ఒక్క చెరువు నింపకుండా.. ఒక్క డ్యాం కట్టకుండా సంబరాలా?
- ఎన్నికల కోసం రైతులను మభ్యపెట్టొద్దు
- రైతు సంక్షేమం కాదు.. రైతు సంక్షోభమే ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం

**: హరీశ్ రావు**



### విజయోత్సవాలు కాదు..

## రైతులకు క్షమాపణ చెప్పాలి : హరీశ్ రావు

న్యూస్ డెస్క్ ,24 జూన్ (కెరటం న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల ముందు రైతు భరోసా పేరిట ఆడుతున్న డ్రామాలు ఆపి, 19 నెలల కాలంలో రైతన్నను అరిగోస పెట్టుకున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఎకరాకు 15,000 చొప్పున ఇస్తామని చెప్పి 12,000కి పరిమితం చేయడం మోసం చేయడమే అని ధ్వజమెత్తారు.

గత వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టి, యాసంగిలో ఎగ్గొట్టి, ఓట్ల కోసం ఇప్పుడు విజయోత్సవాల పేరిట సంబరాలు జరపడం రైతులను మోసం చేయడమే అని మండిపడ్డారు. చెప్పింది కొండంత, చేసింది గోరంత. ఎన్నికల ప్రచారంలో రైతులను మభ్య పెట్టావు. అధికారంలోకి వచ్చాక నిండా ముంచావు. రైతులకు ఏం చేశావని సంబరాలు చేస్తున్నావ్ రేవంత్ రెడ్డి..? రెండు సీజన్ల రైతు భరోసా ఎగ్గొట్టినందుకా? కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వనందుకా? రైతు కూలీలందరికి ఆత్మీయ భరోసా అని ఇవ్వకుండా మోసం చేసినందుకా? రుణమాఫీ చారణ చేసి బారాణ మందిని మోసం చేసినందుకా? అన్ని పంటలకు బోనస్ అని, సన్నాలకే పరిమితం చేసినందుకా? 1200 కోట్ల బోనస్ డబ్బులు చెల్లించినందుకా? ప్రీమియం చెల్లించక రైతు బీమా అమలు ప్రశ్నార్థకం చేస్తున్నందుకా? పంట బీమా అని చెప్పి ఉసురుమనిపించినందుకా? దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసినందుకా? లగచర్ల, రాజోలి రైతుల చేతులకు బీడీలు వేసినందుకా? ఏడాదిన్నర పాలనలో ఒక్క చెరువు నింపకుండా, ఒక్క చెక్ డ్యాం కట్టకుండా, కొత్తగా ఒక్క ఎకరాకు నీళ్ళు ఇవ్వనందుకా?

# ఆపదలో ఆదుకున్న ఆత్మ బంధువులు..!

## డీటీ రాజేష్ ఖన్నా కోసం తరలి వచ్చిన రెవెన్యూ బలగం
## కష్టాల కడలిలో తోడై నిలిచిన ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి
## మంగళ సూత్రాలను అమ్మి ఆస్పత్రి బిల్లులు చెల్లించాలనుకున్నా
## జేఏసీ నేతలతో వాపోయిన రాజేష్ ఖన్నా భార్య రమాదేవి

మొదటి పేజీ తరువాయి

ఇదంతా ఎవరిదో కాదు.. ఓ మధ్య తరగతి రెవెన్యూ ఉద్యోగి గాథ. వరంగల్ జిల్లా, నల్లబెల్లి డిప్యూటీ తహశీల్దార్ రాజేష్‌ఖన్నా కుటుంబ ధీన పరిస్థితి. విషయం తెలుసుకున్న తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి ఆ కుటుంబానికి కొండంత అండగా నిలిచారు. లచ్చిరెడ్డి, మిగతా సంఘాలైనా డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షంతో ఆస్పత్రికి వెళ్లి రాజేష్ ఖన్నాను పరామర్శించారు. అతడి కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. బంజారాహిల్స్‌లోని విరంచి ఆస్పత్రి నిర్వాహకులతో మాట్లాడి బిల్లుల భారం కూడా లేకుండా చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆస్పత్రి నుంచి క్షేమంగా ఇంటికి వెళ్లే విధంగా చేశారు. ఇదే కాకుండా వాహనాన్ని కూడా ఏర్పాటు చేసి రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులుగా బాధ్యతతో పాటు మానవత్వాన్ని కూడా చాటుకున్నారు. మెరుగైన వైద్యం అందించడంతో పాటు బిల్లుల భారం లేకుండా చేసిన ఆస్పత్రి యజమాన్యానికి ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**మాకు దుఃఖ సాగరంలో పెద్దదిక్కుగా నిలిచారు.. మీ రుణం మేము మర్చిపోలేము:రాజేష్ ఖన్నా భార్య రమాదేవి**

వైద్య ఖర్చుల కోసం ఎంతో దుఃఖంతో చివరికి తన మంగళ సూత్రాలను అమ్మి హాస్పిటల్ బిల్లులు చెల్లించాలనుకున్నా. ఎటూ దిక్కు తోచలేదు. నా బాధని, కుటుంబ కష్టాల్ని వీడియో రూపంలో పంపించాను. దాన్ని చూసి తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక తక్షణమే ఆస్పత్రికి చేరుకున్నారు. ఏం భయ పడొద్దు, బాధ పడొద్దు మేమున్నాం మీకు తోడుగా అంటూ పెద్ద భరోసా ఇచ్చారు. అప్పుడు మా కుటుంబానికి కొండంత అండ దొరికినంత నమ్మకం వచ్చింది. ఆస్పత్రి యజమాన్యంతో మాట్లాడి రూ.7 లక్షల బిల్లులను మాఫీ చేయించారు. ఇంటికి క్షేమంగా చేరడానికి వాహనం ఏర్పాటు చేసి, నా భర్తకు పునర్జన్మని ఇచ్చి, నాకు నా కుటుంబానికి, నా పిల్లలకు కొండంత నిలిచారు.

తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బాణాల రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్షం, ఇతర నాయకులకు, మాకు అన్ని రకాలుగా చేయూతనిచ్చిన అన్నలకు, అక్కలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నాను.

మన అనుకున్న వాళ్లు కూడా అడిగితే సహాయం చేయలేని ఈ రోజులలో కేవలం నా వీడియోని చూసి వెంటనే స్పందించి నా దుఃఖాన్ని చూసి నా భర్తని కాపాడడానికి ముందుకు వచ్చిన మానవతామూర్తులకు రెండు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ముఖ్యంగా హాస్పిటల్ యాజమాన్యం మా మా బాధలను, ఉద్యోగ సంఘాల వారు చెప్పిన కష్టాలను తెలుసుకొని సహాయం చేశారు. ఈ సందర్భంగా మీడియా ముఖంగా విరంచి హాస్పిటల్స్ యాజమాన్యానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు.

# ట్రంప్ సీస్‌ఫైర్ విఫలం.. ఇజ్రాయెల్‌పై మళ్లీ ఇరాన్ క్షిపణి దాడులు..!



**న్యూస్ డెస్క్ ,24 జూన్ (కెరటం న్యూస్):** కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన ఇరాన్‌పై గట్టిగా స్పందించాలని తాను ఐడీఎఫ్‌కు ఆదేశించానని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ పేర్కొన్నారు. టెహ్రాన్‌కు అతి ముఖ్యమైన ప్రాంతాలే లక్ష్యంగా దాడులు చేయాలని పేర్కొన్నట్లు వెల్లడించారు. బీర్‌షెబాలో నివాస భవనాన్ని ఇరానియన్ క్షిపణి ఢీకొంది. ఇందులో నలుగురు మృతి చెందగా.. డజను మందికి గాయాలైనట్లు తెలుస్తోంది. మరోవైపు.. ఇజ్రాయెల్ ఆరోపణలపై ఇరాన్ స్పందించింది. ఇజ్రాయెల్‌పై మిస్సైల్ దాడులను ఇరాన్ ఖండించింది. తాము సీస్‌ఫైర్ ఉల్లంఘించలేదని ప్రకటించింది. ఇరాన్ క్షిపణులు ప్రయోగించిందని ఇజ్రాయెల్ ఆరోపించడంతో ట్రంప్ సీస్‌ఫైర్ విఫలమైంది. ఇరాన్ క్షిపణుల దాడికి తక్షణమే ఇజ్రాయెల్ ప్రతిస్పందించింది. దీంతో మిడిల్ ఈస్ట్ పరిణామాలు మళ్లీ ఉద్రిక్తతకు దారితీశాయి. ట్రంప్ మధ్యవర్తిత్వంతో వచ్చిన సీస్‌ఫైర్ 24 గంటలు కూడా నిలబడలేదు. ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు మళ్లీ ముదిరే అవకాశాలు ఉన్నాయి. యుద్ధ విరమణ ఒప్పందం కూలిపోయిన నేపథ్యంలో ప్రపంచం ఉత్కంఠ నెలకొంది.

# ఎన్నికల్లో గెలిచే దమ్ము లేకే ఫోన్ ట్యాపింగ్..

మొదటి పేజీ తరువాయి

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీజేపీ నేతలు ఈటల రాజేందర్, ప్రేమేందర్ రెడ్డి వాంగ్మూలాలను మంగళవారం సిట్ అధికారులు నమోదు చేశారు. 2023 నవంబర్ ఎన్నికల సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీరిద్దరి ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. ఇప్పటి వరకు 4వేల ఫోన్లు ట్యాపింగ్ అయినట్లు సిట్ అధికారులు కనుక్కున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ ఎదుట ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈటల స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డు చేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి బాధితుడిని తనేనంటూ ఈటల ఆరోపించారు. తన కుటుంబ సభ్యులు, డ్రైవర్లు, గన్‌మెన్‌లు ఫోన్లు ట్యాపింగ్ చేశారని ఆరోపణలు చేశారు. హుజురాబాద్ ఉప ఎన్నికతో పాటు అంతకుముందు, తర్వాత కూడా ఫోన్ ట్యాపింగ్‌కి గురైనట్లు సిట్ గుర్తించింది. అలాగే.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సిట్ అధికారులకి ఫిర్యాదు చేశారు. 2020 నుంచి 2024 వరకు తన ఫోన్ సంభాషణలను రహస్యంగా తెలుసుకున్నారని ఫిర్యాదులో మాధవరం కృష్ణారావు తెలిపారు. కుట్ర పూరితంగా కేసీఆర్ ప్రభుత్వం తన ఫోన్ ట్యాప్ చేసినట్లు సిట్‌కి తెలంగాణ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెజండ్ల కిషోర్ బాబు ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఆధారాలను సిట్ అధికారులకి కిషోర్ బాబు ఇచ్చారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు నత్తనడకన నడుస్తోంది: ఎంపీ ఈటల రాజేందర్

ఫోన్ ట్యాపింగ్ కేసు నత్తనడకన నడుస్తోందని బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. అధికారులందరూ కేసీఆర్‌కు తొత్తులుగా వ్యవహరించారని ఆరోపించారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు నిబంధనలు అతిక్రమించి కేసీఆర్ కోసం పనిచేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వలో అన్ని రంగాల్లోని ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేశారని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ హక్కును ఆటంకం కలిగించే హక్కు ఎవరికీ లేదని అన్నారు. సంఘవిద్రోహ శక్తులవి కాకుండా నాయకులు ఫోన్లను కేసీఆర్ ప్రభుత్వం ట్యాపింగ్ చేయడం దారుణమని ధ్వజమెత్తారు ఎంపీ ఈటల రాజేందర్.

తనతో పాటు తన కుటుంబ సభ్యులు, అనుచరుల ఫోన్లు ట్యాపింగ్ చేయడం దారుణమని ఎంపీ ఈటల రాజేందర్ ఫైర్ అయ్యారు. హుజురాబాద్ ఎన్నికల్లో తన ఫోన్ ట్యాపింగ్‌కి గురైందని ఆరోపించారు. తాను ఎవరితో మాట్లాడినా తన మాటలను విని తన వారిని బెదిరించేవారని చెప్పుకొచ్చారు. తమ నాయకులకు సంబంధించిన అన్ని సంభాషణలు కూడా వినేవారని అన్నారు. మునుగోడు బై ఎలక్షన్‌లో ఎక్కడ ఉంటున్నాం.. ఎవరితో మాట్లాడుతున్నాం, బీజేపీ ప్రణాళికలను కూడా పూర్తిగా వినేవారని తెలిపారు. ఎన్నికల్లో గెలిచే దమ్ములేకే కేసీఆర్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసిందని ధ్వజమెత్తారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరంపై రేవంత్ ప్రభుత్వం విచారణ కమిటీ వేసింది కానీ దర్యాప్తు వేగంగా జరగడం లేదని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# కష్టపడితేనే పదవులు.. మరో పదేళ్లు అధికారం మనదే: సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

పదేళ్లు నాదే బాధ్యత:

ఉమ్మడి రాష్ట్రంలో 1994 నుంచి 2004 వరకు టీడీపీ, 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని సీఎం చెప్పారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ రెండు సార్లు అధికారంలో ఉందని 2023 నుంచి 2033 వరకు పదేళ్లు కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అధికారంలో ఉండబోతున్నదన్నారు. ఈ పదేళ్లు పార్టీ కోసం పని చేసే వారిని కాపాడుకునే బాధ్యత పార్టీ తీసుకుంటుందన్నారు. పదేళ్లు అధికారం నడిపించే వరకు నేను బాధ్యత తీసుకుంటా. ఆ తర్వాత పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి నడిపించాల్సిన బాధ్యత పార్టీలోని యువతరం తీసుకోవాలని చెప్పారు. రెండోసారి అధికారంలోకి రావడం కార్యకర్తల చేతుల్లో ఉందని, ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు అందుబాటులోకి తేవాలన్నారు. పార్టీ పదవులను చిన్నచూపు చూడవద్దని ఈ పార్టీ పదవులే మిమ్మల్నీ పెద్ద నాయకులుగా తీర్చిదిద్దుతుందన్నారు. కులగణన చేసి మోడీ ప్రభుత్వానికి సవాల్ విసిరాం. కేంద్రం కూడా జనగణనతో పాటు కలగణన చేసే పరిస్థితి తీసుకువచ్చాం. ఎస్సీ వర్గీకరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తీసుకువస్తున్నాం. త్వరలో డీలిమిటేషన్ జరగబోతున్నదని సీట్లు పెరగబోతున్నాయన్నారు. మహిళా రిజర్వేషన్లు రాబోతున్నాయి. జమిలీ ఎన్నికలు తేస్తామని చెబుతున్నారని ఆ సమయానికి మనమంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ 18 నెలలో గోల్డెన్ పీరియడ్ అని అన్నారు.

# పోలవరం బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు నష్టం లేదు..: చంద్రబాబు

**న్యూస్ డెస్క్ ,24 జూన్ (కెరటం న్యూస్):** సచివాలయంలో మంగళవారం ఏపీ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది .42 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అజెండా అంశాల అనంతరం రాజకీయ అంశాలపై చర్చ జరిగింది. పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై అనుమానాలు నివృత్తి చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ఘనంగా తెలంగాణకు ఉన్న అన్ని అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ద్వారా వరద జలాలే వాడుకుంటున్నాం అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టం లేదన్నారు. తెలంగాణలో అనుమతులు లేకుండా ఎన్నో ప్రాజెక్టులు చేపట్టిన అభ్యంతరం చెప్ప లేదు అన్నారు. పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై నేతలు అంతా మాట్లాడాలన్నారు. కేవలం రాజకీయం కోసమే తెలంగాణలో కొందరు అభ్యంతరాలు చెబుతున్నారని అన్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన బాధ్యత మంత్రులు, నాయకులపై ఉందన్నారు.

# రాజకీయాలకతీతంగా బోనాలు చేసుకుందాం.. పొన్నం పిలుపు

మొదటి పేజీ తరువాయి

దేవాలయ ఏర్పాట్ల కోసం భాగస్వామ్యం అవుతున్న అందరికీ అభినందనలు తెలియజేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయం లోపల కేబుల్ వైర్‌లు కొత్తవి వేసి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. భారీ కెడింగ్ జాలి ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆతిథ్యం ఇవ్వడంలో హైదరాబాద్ నగర ప్రజలు ఎవరికీ తీసి పోరన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు స్థానిక హైదరాబాద్ ప్రజలు వారి ఆతిథ్యం ఇవ్వాలన్నారు. ఒక్కో వారం ఒక్కో ఏరియాలో పండుగ జరుగుతుంది కాబట్టి ఆయా ప్రాంతాల్లో వాటర్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని.. అవసరమైతే రెండు సార్లు నీటిని ఇవ్వాలని ఆదేశించారు. హైదరాబాద్ మొత్తం ఒకేసారి పండుగ జరిగితే కొంత ఇబ్బంది ఉంటుందని.. కానీ ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉంటుందని, భద్రత విషయంలో పోలీసులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని.. ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. 3600 దేవాలయాలకు సంబంధించి సమీక్ష రాష్ట్ర స్థాయి అధికారులతో జరిగిందని తెలిపారు. గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, బల్కంపేట, లాల్ దర్వాజా ఇలా ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని.. జోగిని వాళ్ళకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. తమకు బోనం ఎత్తుకునే వారే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బోనాల సమయంలో కాకుండా రద్దీ తక్కువ ఉన్న సమయంలో వీఐపీ వస్తే ఇబ్బందులు ఉండవన్నారు. ఉజ్జయిని మహంకాళి బోనాలు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉండాలని తెలిపారు. డెక్కన్ మానవ సేవ సమితి , ఇతర సంస్థలు ఇక్కడ చాలా సేవ కార్యక్రమాలు చేస్తున్నాయన్నారు. అందరూ వారి సహకారం అందించి ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తలసాని, జిల్లా కలెక్టర్ హరిచందన, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత పాల్గొన్నారు.

# బీజేపీలో చేరికపై శశిథరూర్ స్పందన



**న్యూస్ డెస్క్ ,24 జూన్ (కెరటం న్యూస్):** కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్.. నిత్యం ఎన్డీఏ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తూ.. ప్రధాని మోడీని ఆకాశానికి ఎత్తుతున్నారు. అంతేకాకుండా బీజేపీ ఎంపీలతో చెట్టాపట్టాల్ వేసుకుని తిరగడంతో శశిథరూర్ పార్టీ మారడం ఖాయమని పొలిటికల్‌గా అందరూ ఫిక్స్ అయిపోయారు. ఎన్నో రోజులుగా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అంతేకాకుండా ఇటీవల కేంద్ర ప్రభుత్వం.. విదేశాలకు దౌత్య బృందాలను పంపించింది. ఆ బృందంలో ఒక కమిటీకి శశిథరూరే నాయకత్వం వహించారు. దీంతో పార్టీ మారడం ఖాయంగా వార్తలు వచ్చాయి. మంగళవారం ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు శశిథరూర్ స్పందించారు. తాజా పరిణామాలను బట్టి చూస్తే.. పార్టీ మారడం ఖాయమా? అని విలేకరి అడిగాడు. దానికి చిరునవ్వు చిందిస్తూ.. బీజేపీలో చేరడానికి అవేమీ సంకేతాలు కావని స్పష్టం చేశారు. ప్రధాని మోడీ చొరవతో.. ఇతర దేశాలతో భారత్ సంబంధాలు మెరుగుపడ్డాయని.. అయితే ఇది బీజేపీనో, కాంగ్రెస్ తీసుకొచ్చిన విదేశాంగ విధానం కాదని.. ఇది భారతదేశ విదేశాంగ విధానం అని చెప్పుకొచ్చారు. సుమారు 11 ఏళ్ల కిందట పార్లమెంట్‌లో విదేశాంగ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా ఉన్నప్పుడు కూడా ఇదే విషయం చెప్పినట్లు గుర్తుచేశారు. అంత మాత్రాన బీజేపీలో చేరతానని కాదని.. ఇది జాతీయ సమైక్యతకు సంబంధించిన విషయంగా పేర్కొన్నారు. ఇక కాంగ్రెస్ అధిష్టానంతో విభేదాలు ఉన్న మాట వాస్తవమేనని.. నాలుగు గోడల మధ్య చర్చించుకుంటే పరిష్కారం అవుతాయని తెలిపారు. తాను ఇప్పటికీ కాంగ్రెస్‌కు విదేయుడినేనని.. పార్టీకి అవసరమైతే పెద్ద పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కచ్చితంగా గెలవాల్సిందే: మీనాక్షి నటరాజన్

**న్యూస్ డెస్క్ ,24 జూన్ (కెరటం న్యూస్):** పీఏసీ మీటింగ్ లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించిన సన్నాహాలను అడిగి తెలుసుకున్నారు తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్. ఉప ఎన్నికపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ ఉప ఎన్నికలో కచ్చితంగా గెలవాల్సిందేనని ఆమె సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం గ్రేటర్ పరిధిలోని నాయకులందర్నీ సమన్వయం చేయాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్ కు బాధ్యతలు అప్పగించారు.

జూబ్లీహిల్స్ బై ఎలక్షన్స్ కు ఎవరిని నియమిస్తున్నారని అడిగిన ప్రశ్నకు.. ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదని సీఎం రేవంత్ చెప్పారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఎంపికపై ఎవరూ మాట్లాడకూడదని ఆదేశించారు. పార్టీ నిర్ణయించి అభ్యర్థిని ప్రకటించే వరకు ఎవరూ కామెంట్స్ చేయొద్దని సూచించారు.

పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదని హెచ్చరించారు సీఎం రేవంత్. ఈ సందర్భంగా తమ సేవలను ఉపయోగించుకోవాలని పలువురు సీనియర్లు తెలిపారు. అయితే పదవులు వచ్చిన వాళ్ళు రాష్ట్రమంతా తిరిగి పార్టీని బలోపేతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు సీఎం.

పీఏసీ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై హాట్ హాట్ గా చర్చ జరిగింది. వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రులు కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోవడంతో తమపై ఒత్తిడి పెరుగుతుందని చెప్పారు. ప్రతి చిన్న పనికి మంత్రుల వద్దకు రావడంతో పని భారం పెరుగుతుందని తెలిపారు. వీలైనంత త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహిద్దామని.. పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు బాధ్యతలు మంత్రులు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు.

# విజయోత్సవాలు కాదు.. రైతులకు క్షమాపణ చెప్పాలి : హరీశ్ రావు

మొదటి పేజీ తరువాయి

ధాన్యం కొనుగోళ్ళు సక్రమంగా జరపనందుకా? జనుము, జీలుగు విత్తనాల ధరలు పెంచి, రైతులకు సకాలంలో అందించినందుకా? వరంగల్ రైతు డిక్లరేషన్ ను అటకెక్కించినందుకా? మీ దుర్మార్గ పాలనలో 511 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా? ఎందుకు సంబురాలు చేస్తున్నావు రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు నిలదీశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు రైతుల బతుకులు సంక్షోభంలో కూరుకుపోయాయి. బిఆర్ఎస్ పాలనలో ఎలాంటి ఆందోళన లేకుండా ఉన్న రైతన్న నేడు ప్రభుత్వ పథకాలు అందక పంట పొలాల్లోనే కుప్ప కూలుతున్నడు. బీఆర్ఎస్ పార్టీది రైతు సంక్షేమ ప్రభుత్వం అయితే, కాంగ్రెస్ పార్టీది రైతు సంక్షోభ ప్రభుత్వం. కేసీఆర్ నాట్లకు నాట్లకు మధ్య రైతు బంధు ఇస్తే, మీరు ఓట్లకు ఓట్లకు మధ్య రైతు భరోసా ఇచ్చి మభ్య పెట్టాలని చూస్తున్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో చేస్తున్న నీ జిమ్మిక్కులను రైతులు నమ్మరు. రైతులను కన్నీళ్లు పెట్టించినందుకు, ఉసురు తీసుకున్నందుకు విజయోత్సవాలు కాదు క్షమాపణలు చెప్పండి. ఇచ్చిన హామీలు ఇప్పటికైనా అమలు చేయండి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# కవితకు సీపీఎం సంపూర్ణ మద్ధతు.. జాన్‌వెస్లీతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ భేటీ

**న్యూస్ డెస్క్ ,24 జూన్ (కెరటం న్యూస్):** బీసీల కోసం ఎమ్మెల్సీ కవిత చేస్తున్న ఉద్యమానికి సీపీఎం సంపూర్ణ మద్దతిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రకటించారు. ఇవాళ హైదరాబాద్‌లోని సీపీఎం స్టేట్ ఆఫీస్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత భేటీ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు న్యాయమైన డిమాండ్ అని చెప్పారు. సామాజిక న్యాయం కోసం ఎమ్మెల్సీ కవిత చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. రిజర్వేషన్లను పెంచి అసమానతలను తొలగించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని అన్నారు. బీజేపీ సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా ఉంటుందని మండిపడ్డారు.

మొన్నటి వరకు కులగణనను కూడా బీజేపీ పార్టీ వ్యతిరేకించిందని, ప్రజా ఉద్యమాలకు తలొగ్గి కులగణన చేయడానికి ముందుకొచ్చిందని అన్నారు. రిజర్వేషన్ల పెంపుపై రాష్ట్ర బీజేపీ నాయకులు నోరు విప్పడం లేదన్నారు. 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కేంద్రంపై ఒత్తిడి చేసే బాధ్యత బీజేపీ నాయకులపై కూడా ఉందన్నారు. కేవలం కేంద్రానికి వినతి పత్రాలు అందించే వరకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం పరిమితం కావొద్దని సూచించారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సీఎం రేవంత్ రెడ్డి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం– కవిత

ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం గత రెండేళ్లుగా ఉద్యమిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీ ఆమోదించిందని, రాష్ట్రపతి ఆమోదానికి బిల్లు మూడు నెలల క్రితమే వెళ్లినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఢిల్లీకి వెళ్లడంలో హాఫ్ సెంచరీ చేసినా సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మెడీతో ఈ అంశంపై మాట్లాడకపోవడం శోచనీయమని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలంటే ఉద్యమబాటనే మార్గం అని భావించారు.జూలై 17న రైల్ వ్యవస్థను స్థంభించే విధంగా రైల్ రోకో చేపట్టబోతున్నామని చెప్పారు. కలిసివచ్చే భావసారుప్యతగల శక్తులన్నింటినీ మద్దతు కోసం కలుస్తున్నామని అన్నారు. ఉద్యమాలకు పేరెన్నికగల సీపీఎం పార్టీ నాయకులను కూడా కలిశామని చెప్పుకొచ్చారు. బిల్లు ఆలస్యమైతే బీసీలు ఉద్యోగులు, విద్యార్థులు రిజర్వేషన్లలో వాటాను కోల్పోతారని హెచ్చరించారు.

# హైదరాబాద్‌లో మొదటిసారి బెట్టింగ్ యాప్ ప్రమోటర్స్ అరెస్ట్

**న్యూస్ డెస్క్ ,24 జూన్ (కెరటం న్యూస్):** హైదరాబాద్‌లో ఆన్ లైన్ బెట్టింగ్ యాప్ ప్రమోటర్స్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తెలుగు రాష్ట్రాల యువతే టార్గెట్‌గా టెలిగ్రామ్‌లో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్నారు. కాగా ఓ వ్యక్తి ఆన్ లైన్‌లో రూ.50 లక్షలు పోగొట్టుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసులు విచారణ జరపగా నలుగురు పట్టుబడ్డారు. నింధితుల్లో విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం ఉన్నారు. దీనికి సంబంధించిన వివరాలను డీజీపీ సాయిశ్రీ మీడియాకు వివరించారు.మనీలాండరింగ్ కోణంలోనూ విచారిస్తున్నట్లు తెలిపారు. బేస్ లెస్ ప్రెడిక్షన్ చేస్తూ ప్రమోటర్లు యూజర్లను మోసం చేస్తున్నారని చెప్పారు. మాయ మాటలతో బెట్టింగ్ రాయుళ్లను రెచ్చగొడుతూ డబ్బులు పెట్టేలా ప్రేరేపిస్తున్నట్టు తెలిపారు. బెట్టింగ్ అనేది ఇల్లీగల్ అని ప్రెడిక్షన్స్ ఇవ్వడం కూడా నేరమే అని స్పష్టం చేశారు. గ్రౌండ్ రియాలిటీకి వాళ్లు చెప్పేదానికి సంబంధం ఉండదని అన్నారు. తెలంగాణలో మొదటి సారి బెట్టింగ్ ప్రమోటర్లను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

# సంక్షేమ కార్యక్రమాలకు రూ.95,351 కోట్లు ఖర్చు: భట్టి విక్రమార్క



**న్యూస్ డెస్క్ ,24 జూన్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలో రూ.22వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో 3వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడాతూ.. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. “రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 10లక్షల వరకు వైద్య సదుపాయం అందిస్తున్నాం. దీంతో 94లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. రూ. 6వేల కోట్ల విలువైన 189 కోట్లు ఉచిత బస్సు టికెట్లు ఇచ్చాం. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్నాం. 93.7లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. సంక్షేమ కార్యక్రమాలకు రూ. 95,351 కోట్లు ఖర్చు చేస్తున్నాం” అని చెప్పారు.

# మత రాజకీయాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు నిలబడాలి




**వైరా,24 జూన్ (కెరటం న్యూస్):** మత రాజకీయాలకి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు నిలబడాలి, కలబడాలి, తెగించి పోరాడాలని, కమ్యూనిస్టులు పోరాడేది అధికారం కోసం, పదవుల కోసం కాదని, దోపిడి రహిత సమాజం ఏర్పాటు కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని సిపిఐ(ఎం) రాష్ట్ర సీనియర్ నాయకుడు పి.సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ అన్నారు. మంగళవారం స్థానిక మిట్టపల్లి గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో జరిగిన వైరా పట్టణం, కొణిజర్ల మండలం సిపిఐ(ఎం) పార్టీ సభ్యులు రాజకీయ శిక్షణా తరగతుల్లో రెండవరోజు ఉదయం "మతం-మతోన్మదం" పాఠ్యాంశం కామ్రేడ్ బండారు రమేష్, సాయంత్రం "పార్టీ నిర్మాణం" పాఠ్యాంశం కామ్రేడ్ పి.సోమయ్య బోధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పోరేట్ సంస్థలు ప్రయోజనాల కోసం మత రాజకీయాలు చేస్తున్న బిజెపి దేశానికి అత్యంత ప్రమాదకరమైన ఆర్ఎస్ఎస్ అడుగుజాడల్లో నడుస్తుందని విమర్శించారు. హిందువులు అందరూ బంధువులు అంటూ విద్వేష రాజకీయాలు చేస్తూ ముస్లింలు, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులు శత్రువులు అంటూ మత విద్వేషలను రెచ్చగొడుతుందని, సామ్రాజ్యవాదానికి, బీజేపీ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ 140 కోట్ల ప్రజల భవిష్యత్తును అంధకారం చేస్తుందని, భారతీయుల జీవితాలను ప్రమాదంలోకి నెట్టివేస్తుందని, దోపిడీని కొనసాగించడానికి, రాజకీయ ప్రయోజనాల కోసం మతోన్మాదంతో మత విద్వేషలను రెచ్చగొడుతూ మనిషిని ఉన్మాదిగా మారుస్తుందని అన్నారు. భారతదేశ సరిహద్దు దేశాలలతో శత్రుత్వాన్ని పాటిస్తున్న మోడీ అమెరికాకు ఆప్త మిత్రులుగా ఊడిగం చేస్తున్నారని, పహాల్గాం ఉగ్రవాదుల దాడి అవకాశంగా తీసుకొని ద్వారా ముస్లింలను శత్రువులుగా సృష్టిస్తున్నారని విమర్శించారు.

భారతదేశంలోని కాశ్మీర్, పంజాబ్, ఈశాన్య ప్రాంతాలలో ఉగ్రవాదులను అమెరికా రెచ్చగొట్టి సమస్యలను సృష్టిస్తుందని ఆరోపించారు. అమెరికా ఉత్పత్తుల దిగుమతులపై సుఖాలు తగ్గించడం వలన వ్యవసాయ రంగం దివాలా తీస్తుందని, రైతుల తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ హిందువులు, ముస్లింల మధ్య ఘర్షణలను సృష్టిస్తూ బిజెపి రాజకీయం చేస్తుందని, ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో దక్షిణ భారతదేశంలో పాగా వేసేందుకు బీజేపీ గట్టిగా ప్రయత్నం చేస్తుందని అన్నారు. గోదావరి జలాలపై ఏపీ ప్రభుత్వం నిర్మించే బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు అన్యాయం జరుగుతుందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి బనకచర్ల నీటి సమస్యను పరిష్కరించాలని, బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని అన్నారు. ఏడాదిన్నర కాలంగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించక పోవడంతో స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేక గ్రామాల్లో పలు రకాల సమస్యలు తీష్టవేశాయని, కేంద్ర నిధులు రాకపోవడంతో కనిసం బ్లీచింగ్ పౌడర్ కొనడానికి కూడా డబ్బులు లేవని, వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం, అసమానతలు ఆకలి, అధిక ధరలు సమస్యల పరిష్కరించడానికి, బిజెపిని నిలువరించడం, ఓడించడమే ప్రధాన ఎజెండాగా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. రాజకీయ శిక్షణా తరగతులకు ప్రిన్సిపాల్ గా పార్టీ వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర సీనియర్ నాయకులు పోన్నం వేంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు మేరుగు సత్యనారాయణ, తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, మేరుగు రమణ, కొణిజర్ల మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య, దుళిపాళ్ళ వెంకటేశ్వర్లు, వైరా డివిజన్ కమిటీ సభ్యులు మచ్చా మణి, దొడ్డపనేని కృష్ణార్జునరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, వైరా పట్టణం, కొణిజర్ల మండలం కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శులు, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ టీచర్ మెహబూబ్ బి కుటుంబానికి న్యాయం చేయాలి



**ఖమ్మం కలెక్టరేట్,24 జూన్ (కెరటం న్యూస్):** కారేపల్లి (సింగరేణి)మండలం గాదేపాడులో అంగన్వాడి సెంటర్లో వీధులు నిర్వహిస్తున్న షేక్ మహబూబ్ బి గత శనివారం ప్రాజెక్టు మీటింగు ఉన్నందువలన కామేపల్లి మండలం లింగాలలో మీటింగుకు హాజరై వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ లో మరణించడం జరిగింది. ఆ మహబూబ్ బి కుటుంబానికి 20 లక్షల రూపాయలు ఎక్స్ గ్రే షియా ప్రకటించాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, అదేవిధంగా యాక్సిడెంట్లో గాయపడిన అంగన్వాడి హెల్పర్ కమల కు వైద్య చికిత్సల నిమిత్తం ఆర్థిక సహకారం అందించాలని, ఆరోగ్యం మెరుగుపడేంతవరకు పని దినాలుగానే చూడాలని కలెక్టర్ ని కోరడం జరిగింది. అదేవిధంగా అంగన్వాడి కేంద్రాలలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న టీచర్ మరియు హెల్పర్స్ పోస్టులను భర్తీ చేయాలని, పక్కా నూతన భవనాలను నిర్మించాలని, మెటీరియల్ గ్రాంట్, మౌలిక వసతులు కల్పించాలని,కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, అంగన్వాడి టీచర్స్ మరియు హెల్పర్స్ లపై అధికారుల వేధింపులను అరికట్టాలని,తదితర సమస్యల పైన ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ కు భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో వినతి పత్రంఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షులు షేక్ సుబహాన్, ప్రగతిశీల అంగన్వాడీ టీచర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ నాయకులు శిరోమణి, పారిజాతం,ఐ యఫ్ టి యు జిల్లా నాయకులు, భాను, గౌని మోహన్ రావు,పటేల్, మాధవ్,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అంటేనే రైతు పక్షపాత పార్టీ

## కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ఆదర్శప్రాయం

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్



**ఖమ్మం బ్యూరో,24 జూన్ (కెరటం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు పక్షపాత పార్టీ అని, నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు ఆదర్శనీయమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ స్పష్టం చేశారు. రైతు భరోసా నిధుల విడుదలకు కృతజ్ఞతగా రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజి శాసనమండలి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, జిల్లా రైతు కన్వీనర్ నల్లమల వేంకటేశ్వరరావు, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్కా శేఖర్ గౌడ్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్



కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా, నగర కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించనైనది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈరోజు మన రాష్ట్ర చరిత్రలో లిఖించదగ్గ రోజని ఏ రాష్ట్రంలో లేని విధంగా అన్ని రాష్ట్రాలకు మోడల్ గా మన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అని, రాష్ట్ర వ్యాప్తంగా 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులను విడుదల చేసి, ఇప్పటి వరకు 1కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత మన కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. అదేవిధంగా ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ఏ ఐ సి సి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి , టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మరియు మంత్రి వర్గానికి ధన్యవాదాలు తెలుపుతూ పాలాభిషేకం చేసి, మిఠాయిలు పంచి సంబురాలు నిర్వహించనైనది. ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా ఐ యన్ టి యు సి, మహిళా కాంగ్రెస్, సేవాదళ్, మైనారిటీ, ఎస్ సి సెల్ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బొడ్డు బొందయ్య, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ కుమార్, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దినేని రమేష్, కోటేరు నర్సిరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వేంకటేశ్వరరావు, మాజి యంపిటిసి నల్లమోతు లక్ష్మయ్య, నగర ఓబీసీ సెల్, ఐ యన్ టి యు సి, ఎస్ టి, మైనారిటీ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, నరాల నరేష్, దేవత్, శంకర్ నాయక్, షేక్ అబ్బాస్ భేగ్, కార్పొరేటర్లు లకావత్ సైదులు నాయక్, పి ఏ సి ఎస్ చైర్మన్ రావూరి సైదుబాబు, చామకూరి వెంకటనారాయణ, దుద్దుకూరి వేంకటేశ్వరరావు, మందడపు లక్ష్మి మనోహర్, కన్నం ప్రసన్నకృష్ణ, తాతా రఘురాం, వాంకుడోత్ దీపక్ నాయక్, విప్లవ కుమార్ పటేల్, గడ్డం వెంకటయ్య, బీరెడ్డి రమేష్, యాసబోయిన శ్రీశైలం, బబ్బూరి నరేంద్ర, కాళంగి కనకరాజు, బోడా శ్రావణ్, జగదీశ్, జాకీర్ హుస్సేన్, యూసఫ్, పర్వత శ్రీనివాస్, కమతం రామకృష్ణ, బండి నాగేశ్వరరావు, రజి భాయ్, జహీర్ భాయ్, వాసీం, మహమూద్, భూక్యా సురేష్ నాయక్, కందుల శ్రీనివాస్, కొలికపొంగు రమేష్, పాషా, గాదర్ బాబు, కలిమెల భద్రం, ఫరీద్ ఖాద్రి, కొత్తపల్లి పుష్ప, కొర్లపాటి అన్నపూర్ణ, దామా స్వరూప, ఊరుకొండ చంద్రిక, చల్లా ప్రతిభారెడ్డి, జ్యోతి, రమాదేవి, ఝాన్సీ, బలుసు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# విజయ కళాశాల విద్యార్థుల అపూర్వ విజయం

## మత్తు పదార్థాలపై షార్ట్ ఫిలిం, వ్యాసరచన పోటీలో సత్తా చాటిన స్టూడెంట్స్



**ఖమ్మం టౌన్,24 జూన్ (కెరటం న్యూస్):** స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాలలో నిన్న జిల్లా స్థాయి మత్తు పదార్థ వ్యతిరేక షార్ట్ ఫిలిం మరియు వ్యాసరచన పోటీలో విజయం సాధించిన విజయ కళాశాల విద్యార్థుల అభినందన సభ నిర్వహించడం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా ఖమ్మం నార్కోటిక్ విభాగం నుండి డి.ఎస్.పి సిహెచ్. శ్రీధర్ మరియు సీఐ విజయ్ రామ్ కుమార్ హాజరవ్వటం జరిగింది. డీఎస్పీ సిహెచ్ శ్రీధర్ గారు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం మన జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుందో విద్యార్థులకు తెలియజేశారు. సీఐ విజయ్ రామ్ కుమార్ మాట్లాడుతూ మన సమాజాన్ని మత్తుమందుల నుండి విముక్తి చేయడానికి మనందరం కలిసి ముందుకు సాగుదాం అన్నారు. జిల్లా స్థాయిలో యాంటీ డ్రగ్ విభాగం నిర్వహించిన మత్తు పదార్థ వ్యతిరేక అవగాహన షార్ట్ ఫిలిం మరియు వ్యాసరచన పోటీలో విజయం సాధించిన విజయ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సంతోష్, తేజస్ గ్రూప్ కు,నేహా మరియు నాల్గవ సంవత్సరం విద్యార్థిని గాయత్రి లకు ప్రశంసా పత్రాలు మరియు బంగారు పతకాలు ఇవ్వడం జరిగింది. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ పి.ఉషా కిరణ్ కుమార్ గారు మరియు వైస్ చైర్ పర్సన్ పి.విజయలక్ష్మి అభినందించడం జరిగింది. జూన్ 26న జరగబోయే అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన సదస్సులో తెలంగాణ 31 జిల్లాల నుంచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రథమ బహుమతికి ఎంపిక చేస్తారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిన్నయ్య మాట్లాడుతూ మత్తు పదార్థాలను కాదనండి జీవితం కోసం అవును అని చెప్పండి అని ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి చిన్నయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అయేషా తరణం, కళాశాల డీన్ డాక్టర్ డి. శ్రీనివాస్, అడ్మిన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ ఫరీద్ బాబా మరియు వివిధ విభాగాధిపతులు పాల్గొనడం జరిగింది.



# యువ జర్నలిస్టు దత్తురెడ్డి హఠాన్మరణం బాధాకరం

## మాజీ ఎంపీ నామ



**హైదరాబాద్ బ్యూరో,24 జూన్ (కెరటం న్యూస్):** ఈనాడు వరంగల్ రిపోర్టర్ జీడిపల్లి దత్తురెడ్డి హఠాన్మరణం పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. చిన్న వయసులోనే తనదైన శైలిలో పత్రికా రంగంలో గుర్తింపు పొందిన దత్తురెడ్డి గుండెపోటుతో మరణించటం బాధాకరమన్నారు. పత్రికా రంగం బాధ్యతతో పనిచేసిన దత్తురెడ్డి లాంటి యువ పాత్రికేయుడిని కోల్పోయిందని, ఆయన చేసిన సేవలు మరవలేనివని నామ తెలిపారు. దత్తురెడ్డి మృతిపై ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసిన నామ, వారి కుటుంబానికి ధైర్యం కలగాలని ఆకాంక్షిస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



# దత్తు రెడ్డి మరణం బాధించింది

## ఎంపీ వద్దిరాజు ఆవేదన



**హైదరాబాద్ బ్యూరో,24 జూన్ (కెరటం న్యూస్):** ఈనాడు దినపత్రిక వరంగల్ జిల్లా ప్రతినిధి జీడిపల్లి దత్తు రెడ్డి అకాల మృతి పట్ల భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆయన కేవలం 37 సంవత్సరాల చిన్న వయసులోనే గుండెపోటుతో హఠాన్మరణానికి గురి కావడం బాధాకరమని తన సంతాప సందేశంలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. దత్తురెడ్డి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ఎంపీ వద్దిరాజు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు, భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ఇవ్వాల్సిందిగా ప్రార్థించారు.



# 'అతడిని ఎందుకు తీసుకున్నారు..
# నితీశ్ రెడ్డి వంద రెట్లు బెటర్'




స్పోర్ట్స్ న్యూస్ , 24 జూన్ (కెరటం న్యూస్): ఠాకూర్ దారుణ ప్రదర్శన కనబరిచాడు. బ్యాటింగ్ ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్ రెడ్డి స్థానంలో తుది జట్టులోకి వచ్చిన శార్ధూల్ ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయాడు. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం ఒకే ఒక్క పరుగు చేసిన ఠాకూర్.. రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే తీరును కనబరిచాడు. జోష్ టంగ్ బౌలింగ్‌లో చెత్త షాట్ ఆడి తన వికెట్‌ను సమర్పించుకున్నాడు. ఈ ముంబై క్రికెటర్ 4 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్‌కు చేరాడు. బౌలింగ్‌లోనూ విఫలమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో 6 ఓవర్లు వేసి 38 పరుగులు సమర్పించుకున్నాడు.

దీంతో భారత కెప్టెన్ శుబ్‌మన్ గిల్ మరో స్పెల్ బౌలింగ్ చేసే అవకాశమివ్వలేదు. అయితే ఈ మ్యాచ్‌లో శార్థూల్ ఠాకూర్‌పై టీమిండియా మెనెజ్‌మెంట్ భారీ అంచనాలు పెట్టుకుంది. లోయార్డర్‌లో శార్థూల్ తన అనుభవంతో పరుగులు సాధిస్తాడని భావించింది. అందుకే ఆసీస్ గడ్డపై దుమ్మురేపిన తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డిని పక్కనపెట్టి మరీ శార్దూల్‌ను ఆడించారు.

కానీ హెడ్ కోచ్ గౌతం గంభీర్, కెప్టెన్ గిల్ నమ్మకాన్ని శార్థూల్ వమ్ము చేశాడు. ఈ క్రమంలో టీమ్‌మెనెజ్‌మెంట్‌పై నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నాడు. శార్థూల్‌ను ఎందుకు అవకాశమిచ్చారు.. అతడి కంటే నితీశ్ రెడ్డి వంద రెట్లు బెటర్ అని పోస్ట్‌లు పెడుతున్నారు.

మరోవైపు శార్దూల్‌కు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 6 ఓవర్ల మాత్రమే బౌలింగ్ ఇవ్వడాన్ని పలువురు మాజీలు తప్పుబడుతున్నారు. అతడిపై మీకు నమ్మకం లేనప్పుడు జట్టులోకి ఎందుకు తీసుకున్నారని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

# నాగ చైతన్య 25వ
# సినిమాకు దర్శకుడు ఫిక్స్



మూవీ న్యూస్,24 జూన్ (కెరటం న్యూస్): నాగ చైతన్య హీరోగా సమంత హీరోయిన్ గా వచ్చిన సూపర్ హిట్ సినిమాలలో 'మజిలీ' కి ప్రత్యేక స్థానం ఉంది. యంగ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. చైతన్య కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచిన ఈ సినిమా ఆన్ స్క్రీన్ నాగ చైతన్య-సమంత భార్య భర్తలుగా కలిసి నటించిన చివరి సినిమా కూడా.

అయితే ఇప్పుడు మరోసారి మజిలీ దర్శకుడితో నాగ చైతన్య సినిమా రాబోతుంది. దర్శకుడు శివ నిర్వాణ ఇటీవల నాగ చైతన్యను కలిసి ఓ కథ చెప్పాడం జరిగింది. పాయింట్ బాగా నచ్చుడంతో శివకు గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చేసాడు చై. దర్శకుడు శివ నిర్వాణ ప్రస్తుతం డైలాగ్ వెర్షన్ ను రెడీ చేసే పనిలో ఉన్నాడు. త్వరలో ఈ సినిమాకు సంబందించి అధికారిక ప్రకటన రాబోతుంది. నాగ చైత్యన్య కెరీర్ లో మైల్ స్టోన్ 25వ సినిమాగా రాబోయే ఈ సినిమా ఫీల్-గుడ్ ఎమోషనల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో రాబోతున్నట్టు సమాచారం. టాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది. ఈ ఏడాది చివరి నాటికి సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. టక్ జగదీష్, ఖుషి వంటి బ్యాక్ టు బ్యాక్ ఫ్లాప్స్ ఇచ్చిన శివ నిర్వాణ నాగ చైతన్యతో సినిమాతో సూపర్ హిట్ కొట్టాలని తీవ్రంగా కసరత్తులు చేస్తున్నాడు. అటు చైతన్య కూడా విరూపాక్ష దర్శకుడితో చేస్తున్న సినిమా ఫినిష్ చేసి శివ నిర్వాణసినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లేలా ప్లాన్ చేస్తున్నాడు.

# శాన్‌ఫ్రాన్సిస్కో యునికార్న్స్‌దే విజయం!



స్పోర్ట్స్ న్యూస్ ,24 జూన్ (కెరటం న్యూస్):మేజర్ లీగ్ క్రికెట్ 2025లో భాగంగా డల్లాస్‌లోని గ్రాండ్ ప్రైరీ స్టేడియం వేదికగా ముంబయి ఇండియన్స్ న్యూయార్క్ శాన్‌ఫ్రాన్సిస్కో యునికార్న్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో శాన్‌ఫ్రాన్సిస్కో జట్టు 47 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ ప్రారంభించిన శాన్‌ఫ్రాన్సిస్కో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 246 పరుగులు చేసింది. బ్యాటర్లలో మ్యాథ్యూ షార్ట్ (91), జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ (64) రాణించాడు. ముంబయి ఇండియన్స్ న్యూయార్క్ బౌలర్లలో పొలార్డ్ 2, నవీన్ ఉల్ హక్ నోస్తూష్ కెన్జిగే చెరో వికెట్ తీసుకున్నారు.

247 పరుగుల విజయలక్ష్యంతో తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన ముంబయి ఇండియన్స్ న్యూయార్క్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి కేవలం 199 రన్స్ మాత్రమే చేయగలిగింది. దీంతో శాన్‌ఫ్రాన్సిస్కో జట్టు 47 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముంబయి ఇండియన్స్ న్యూయార్క్ బ్యాటర్లలో క్వింటన్ డికాక్ (70), మొనాక్ పటేల్ (60) రాణించారు. శాన్‌ఫ్రాన్సిస్కో బౌలర్లలో జేవియర్ బార్ట్‌లెట్ , రొమారియో షెఫర్డ్ చెరో రెండు, హరీస్ రవూఫ్, లియామ్ ప్లంకెట్ చెరో వికెట్ తీసుకున్నారు.

# అల్లు అర్జున్ 'ఐకాన్' లేనట్టే
# - దిల్ రాజు




మూవీ న్యూస్,24 జూన్ (కెరటం న్యూస్): ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అభిమానులను చాలా కాలంగా ఊరిస్తూ వస్తున్న చిత్రం 'ఐకాన్. పుష్ప సినిమాకు ముందు ఈ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రాజెక్ట్ అల్లు అర్జున్‌తో రద్దయినట్లు నిర్మాత దిల్ రాజు ప్రకటించాడు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌తో వేరే హీరోతో ముందుకు వెళ్తుందని ఆయన వెల్లడించారు.'వకీల్ సాబ్' దర్శకుడు వేణు శ్రీరామ్ అల్లు అర్జున్ కోసం 'ఐకాన్' కథను సిద్ధం చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి అధికారికంగా ఒక పోస్టర్‌ను కూడా వదిలారు.ఔ అయితే, 'పుష్ప' సినిమాతో అల్లు అర్జున్ బిజీ కావడంతో, ఈ ప్రాజెక్టు ఆలస్యమవుతూ వచ్చింది. ఈ మధ్యలో వేణు శ్రీరామ్ నానితో 'తమ్ముడు' అనే మరో కథను సిద్ధం చేసుకున్నారు. అయితే పుష్ప సినిమాతో అల్లు అర్జున్‌కి వచ్చిన క్రేజ్ కారణంగా ఐకాన్ చిత్రం అల్లు అర్జున్ సెట్ కాదని మేకర్స్ ఆలోచించినట్లు సమాచారం.

ఇదే విషయంపై దిల్ రాజు మాట్లాడుతూ.. అల్లు అర్జున్ ప్రస్తుతం ఉన్న బిజీ షెడ్యూల్ కారణంగా 'ఐకాన్' సినిమా చేసే అవకాశం లేదు. అందుకే ఈ మూవీ కోసం వేరే హీరోని తీసుకునే ఆలోచనలో ఉన్నాం. 'తమ్ముడు' విడుదలైన తర్వాత వేణు శ్రీరామ్ 'ఐకాన్' స్క్రిప్ట్‌ను ముందుకు తీసుకెళ్తారు. ఇది యూనివర్సల్ స్క్రిప్ట్. హ్యూమన్ ఎమోషన్స్‌తో కూడిన ఒక యాక్షన్ ఫిలిం ఇది" అని వెల్లడించారు.

# చీకటి ముసిరిన కుటుంబంలో

## టీజీఈ జేఏసీ

# వెన్నెల సంతకం

- చీకటి బతుకుల్లో వెన్నెల సంతకం
- ఆపదలో ఆదుకున్న టీజీఈజేఏసీ ఆత్మ బంధువులు..!
- డీటీ రాజేష్ ఖన్నా కోసం తరలి వచ్చిన రెవెన్యూ బలగం
- కష్టాల కడలిలో తోడై నిలిచిన ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి
- మంగళ సూత్రాలను అమ్మి ఆస్పత్రి బిల్లులు చెల్లించాలనుకున్నా..జేఏసీ నేతలతో వాపోయిన రాజేష్ ఖన్నా భార్య రమాదేవి

హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్




దుమ్ములోంచి..దూళిలోంచి నడిసొచ్చి..తాను నడిచిన నేలపై మానవతా సుమాలు పరచడం ఎవరికి సాధ్యమౌతుంది..? అప్పటిదాకా ఓ ప్రభుత్వ ఉద్యోగిగా గౌరవంగా బతుకుతున్న ఓ కుటుంబంలో అనుకోని విధంగా అనారోగ్యం వికటాట్టహాసం చేస్తే కకావికలౌతున్న సదరు ఉద్యోగి కుటుంబానికి కొండంత అండగా నిలిచి అక్కున చేర్చుకోవాలన్న భావన ఎందరికి కలుగుతుంది..? తనతో ఏడడుగులు వేసి, కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న తన భర్త అనారోగ్యానికి ఆస్పత్రిలో అయిన బిల్లు చెల్లించలేక ఏకంగా ఆరో(ప్రాణంగా భావించే తాళినే అమ్ముకునేందుకు సిద్ధపడిన ఓ ఇల్లాలికి పెద్దన్నగా కొండంత అండగా నిలిచిన వారిని ఏమని కీర్తించాలి..? అనారోగ్యంతో జీవితపు సుడిగుండంలో చిక్కుకున్న తోటి ఉద్యోగి కుటుంబం కన్నీటిని తుడిచి ఆ కుటుంబానికి చేయూత అందించే సాహసం ఈ రోజుల్లో ఎంతమంది చెయ్యగలరు.. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడు లక్షల రూపాయల ఆస్పత్రి బిల్లు నయాపైస చెల్లించకుండా ఆస్పత్రి యాజమాన్యాన్ని మెప్పించిన దార్శనికత ఈ రోజుల్లో చూడగలమా..? ఒక్క దీపం లక్ష దీపాలుగా, ఒక కిరణం కోటి వెలుగులుగా ఒక జేఏసీ వేలాది మంది జీవితాల్లో ప్రసరించడం ఊహించగలమా..? ఆశయాన్ని ఆచరణతో ముడివేసిన ఓ ఉద్యోగ సంఘ నాయకుడు అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. ఆయనే తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి. టీజీఈజేఏసీలో మూర్తీభవించి మానవత్వపు పరిమళాలాలు పంచుతూ..తోటి ఉద్యోగుల సంక్షేమం, సంతోషమే తన సంతోషంగా ఎంచుకుని చీకటి ముసిరిన బతుకుల్లో వెన్నెల సంతకం చేస్తున్న లచ్చన్నకు, ఆయన జేఏసీ సహచర బాధ్యులకు యావత్ తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల కుటుంబాల నుండి జేజేలు, హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఇందుకు సంబంధించి కెరటం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి అందిస్తోన్న స్పెషల్ స్టోరీ మీ కోసం...

### చీకటి ముసిరిన కుటుంబంలో వెన్నెల సంతకం

వరంగల్ జిల్లా నల్లబెల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రాజేష్‌ఖన్నా కుటుంబం ఓ మధ్యతరగతి కుటుంబంగా సమాజంలో గౌరవంగా బతుకుతోంది. కానీ అంతలోనే ఆ కుటుంబంలో అనారోగ్యం అనే తుపాను పెద్ద అలజడి రేపింది. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న రాజేష్‌ఖన్నాను తీవ్ర అనారోగ్యం చుట్టుముట్టడంతో ఆయన్ను ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చారు. వైద్య ఖర్చులకోసం అందిన కాడికి తెచ్చి బిల్లులు చెల్లించారు. ఇంటికి పెద్ద దిక్కును బతికించుకునేందుకు ఆ ఇంటి ఇల్లాలు పడరాని పాట్లు పడింది. ఇక డిశ్చార్జీ చేసే నాటికి రూ.7లక్షల బిల్లు చెల్లించాలని ఆస్పత్రి యాజమాన్యం చెప్పడంతో అప్పుసప్పు చేసినా ఆస్పత్రి బిల్లులు చెల్లించలేని దుస్థితి. చివరకు మంగళ సూత్రాలనైనా అమ్మి ఆస్పత్రి బిల్లులు చెల్లించాలనుకుంది ఆ ఇంటి ఇల్లాలు. ఈ విధంగా దిక్కుతోచని స్థితిలో కష్టాల కడలిలో ఉన్న ఆ కుటుంబానికి ఎడారిలో ఒయాసిస్‌లా రెవెన్యూ బలగం తోడై నిలిచింది. డీటీ రాజేష్‌ఖన్నా కుటుంబ దీనస్థితి గురించి తెలుసుకున్న తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి ఆ కుటుంబానికి కొండంత అండగా నిలిచారు. లచ్చిరెడ్డి, మిగతా సంఘాలైనా డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షంతో ఆస్పత్రికి వెళ్లి రాజేష్ ఖన్నాను పరామర్శించారు. అతడి కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. బంజారాహిల్స్‌లోని విరంచి ఆస్పత్రి నిర్వాహకులతో మాట్లాడి బిల్లుల భారం కూడా



లేకుండా చేశారు. రాజేష్ ఖన్నా ఆస్పత్రి నుంచి క్షేమంగా ఇంటికి వెళ్లె విధంగా వాహనాన్ని కూడా ఏర్పాటు చేసి రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులుగా బాధ్యతతో పాటు మానవత్వాన్ని కూడా చాటుకున్నారు. మెరుగైన వైద్యం అందించడంతో పాటు బిల్లుల భారం లేకుండా చేసిన ఆస్పత్రి యజమాన్యానికి ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సేవకు సారధి..మానవతకు వారధిగా పేరున్న లచ్చన్నకు, ఆయన జేఏసీకి ఆ కుటుంబం జన్మజన్మలా రుణపడి ఉంటామని తెలియజేస్తున్నారు.

### మీ రుణం తీర్చలేనిది: రాజేష్ ఖన్నా భార్య రమాదేవి

వైద్య ఖర్చుల కోసం ఎంతో దుఃఖంతో.. చివరికి తన మంగళ సూత్రాలను అమ్మి హాస్పిటల్ బిల్లులు చెల్లించాలనుకున్నా. ఎటూ దిక్కు తోచలేదు. నా బాధని, కుటుంబ కష్టాల్ని వీడియో రూపంలో పంపించాను. దాన్ని చూసి తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక తక్షణమే ఆస్పత్రికి చేరుకున్నారు. ఏం భయ పడొద్దు, బాధ పడొద్దు మేమున్నాం మీకు తోడుగా అంటూ పెద్ద భరోసా ఇచ్చారు. అప్పుడు మా కుటుంబానికి కొండంత అండ దొరికినంత నమ్మకం వచ్చింది. ఆస్పత్రి యజమాన్యంతో మాట్లాడి రూ.7 లక్షల బిల్లులను మాఫీ చేయించారు. ఇంటికి క్షేమంగా చేరడానికి వాహనం ఏర్పాటు చేసి, నా భర్తకు పునర్జన్మని ఇచ్చి, నాకు నా కుటుంబానికి, నా పిల్లలకు కొండంత అండగా నిలిచారు.

తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బాణాల రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్షం, ఇతర నాయకులకు, మాకు అన్ని రకాలుగా చేయూతనిచ్చిన అన్నలకు, అక్కలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నాను. మన అనుకున్న వాళ్లు కూడా అడిగితే సహాయం చేయలేని ఈ రోజులలో కేవలం నా వీడియోని చూసి వెంటనే స్పందించి నా దుఃఖాన్ని చూసి నా భర్తని కాపాడడానికి ముందుకు వచ్చిన మానవతామూర్తులకు రెండు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ముఖ్యంగా హాస్పిటల్ యాజమాన్యం మా మా బాధలను, ఉద్యోగ సంఘాల వారు చెప్పిన కష్టాలను తెలుసుకొని సహాయం చేశారు. ఈ సందర్భంగా మీడియా ముఖంగా విరంచి హాస్పిటల్స్ యాజమాన్యానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు అంటూ రాజేష్ ఖన్నా సతీమణి రమాదేవి తన కృతజ్ఞతలు తెలుపుకున్నారు.